# స్కార్పియో-బండి

-యెన్నం ఉపేందర్

సర్రున దుమ్ము లేపుకుంటూ వస్తున్న స్కార్పియోను చూసి పిల్లలు హుషారుగా కేరింతలు కొట్టసాగారు. ముసలివారు చేయి నుదుట పెట్టుకొని వర్షపు మబ్బుల కోసం చూసి నట్లు చూడసాగారు. స్కార్పియో ఆఊరి భూస్వామి ఇంటి ముందు ఆగింది. వాహనం దిగుతూనే ఓ పదేండ్ల పాప,

'డర్టీ స్మెల్ డాడీ' అంటూ ముక్కు మూసుకుంది. బజారంతా బురద బురదగా ఉంది. బజారు పక్కన పశువుల పెంట కుప్పగా పడి ఉంది. సూటులో ఉన్న వ్యక్తి జాగ్రత్తగా బురదలో వేసిన బండరాళ్ళపై అడుగులు వేస్తూ, పాపను జాగ్రత్తగా నడవమని చెబుతూ నడుస్తున్నాడు. ఇంతలో భార్య 'స్లిప్' కావడంతో,

'బి కేర్ ఫుల్ మిసెస్ మాధవ్' అన్నాడు అతను.

ఓ చేత్తో ముక్కు మూసుకొని, మరో చేత్తో చీరను జాగ్రత్తగా సవరించుకుంటూ భర్త అడుగులో అడుగు వేసి నడవసాగింది ఆమె. అది చూసి జనం చెవులు కొరుక్కోసాగారు.

'గిదేం పాపం! చేతుల్నిండా రైక గుడ్డేసుకుంటే ఏం బాయే' అంటూ ఆ స్లీవ్‌లెస్ యువతిని విమర్శిస్తున్నారు. మరికొంతమంది మాధవ్‌కి దండాలు పెడుతున్నారు.

'దొరబాబుగారు బాగున్నారా' ఎవరో అడుగుతున్నారు. పిల్లలు స్కార్పియో చుట్టూ చేరి దాన్ని ముట్టుకోవాలని శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. డ్రైవర్ అక్కడే ఉండి పిల్లల్ని గెదుముతున్నాడు.

'డర్టీ స్మెల్ డాడీ' పాప మరోసారి ఫిర్యాదు చేసింది. మాధవ్ నుంచి జవాబు రాలేదు. మాధవ్‌ని చూస్తూనే, చుట్ట కాల్చుతున్న రాఘవయ్య ఎదురొచ్చాడు. పాపని చూస్తూ 'దామ్మా' అంటూ ఎత్తుకోబోయాడు. భారీ మీసాల్తో ఉన్న రాఘవయ్యను చూసి పాప తల్లి వెనుకకు పోయింది. రాఘవయ్య పాపను బలవంతంగా ఎత్తుకున్నాడు. ఆ చుట్ట వాసనకి పాప మరోసారి,

'డర్టీ స్మెల్ డాడీ' అన్నది.

'ఏందిరా! ఏమంటుంది పిల్ల' రాఘవయ్య, మాధవ్‌ని అడిగాడు.

మిసెస్ మాధవ్‌కి మాత్రం చాలా అసహనంగా ఉంది. ఆమె ఇంటి లోపలికి వచ్చినప్పటి నుంచి ఇంటి గోడల్ని, పై కప్పుని జాగ్రత్తగా పరిశీలించసాగింది. ఆమెని గమనించిన మాధవ్,

'కాళ్ళు కడుక్కుందువు గాని రా' పిలిచాడు.

నిజానికి మిసెస్ మాధవ్‌కి ఊరు రావాలని లేదు. ఎప్పుడో పెళ్ళప్పుడు ఊరిని చూసింది. అసలు ఆమెకి పల్లెటూరంటే చిరాకు. మాధవ్ పోరు భరించలేక వచ్చింది.

పని మనుషులు స్కార్పియో నుంచి పరుపు, దిండ్లు, చద్దర్లు, భోజనం సామగ్రి దించారు. అది చూసి రాఘవయ్య నొచ్చుకున్నాడు.

'అదేందిరా? చాపత్తతో పాటుగా పట్నంనుంచి తెచ్చుకున్నారా! మేమేం అడక్కతినట్లేదుగా' నిష్ఠూర పడ్డాడు.

'ఏం లేదు.. ఒక్కసారే అలవాట్లు మారితే ఇబ్బంది..' నసిగాడు మాధవ్.

ముసలాయన బాధపడ్డాడు. అయితే రాఘవయ్య భార్య, కొడుకు, కోడలు, మనవరాలి రాకతో ఇల్లంతా తానై తిరగసాగింది. ఆమె మనవరాలిని చూడటం అదే మొదటిసారి. ఆమె పిండి వంటలు చేయటం మొదలు పెట్టింది.

వంట గదివైపు వచ్చిన పాప మండుతున్న పొయ్యి దగ్గరికి వచ్చింది. మండుతున్న కట్టెల్ని, దాని మీద తుక, తుక ఉడుగుతున్న అన్నం కుండని చూసింది.

'ఇదేంటి డాడీ' అడిగింది పాప.

'అన్నం' అని ఇంగ్లీషులో చెప్పాడు మాధవ్.

పాపకి ఆశ్చర్యం వేసింది. ఇంతలో రామలక్ష్మి అక్కడికి వచ్చింది.

'మనవరాలు ఏమడుగుతోందిరా' ఆప్యాయంగా అడిగింది.

'ఇదేంటని అడుగుతోంది' అంటూ అన్నం ఉడుగుతున్న కుండని చూపించాడు.

రామలక్ష్మి బిగ్గరగా నవ్వింది.

'పిల్లా! నీ కన్నమెట్ల చెయ్యాల్నో చెప్త. నీ మొగుడికి వండి పెడుదువుగాని లే' అని పాపని కూరాడు కుండ దగ్గరికి తీసుకెళ్ళింది.

'మొదగాల కూరాడు కుండల్నించి రెండు మూడు గిలాసలంత కలి, కుండల ఒంపాల. ఈ కూరాడు కుండల రోజు గింత రోజు గింత గంజి పోస్తం. అట్ల ఒంపిన కలిల నీల్లు బోసి పొయ్యి మీద పెద్తం. ఆ కుండ మీద మాలేస్ర బుడ్డి పెట్టి భగ భగ మంటపెద్తం. కలి తకబిక ఉడ్కుతాంటే, దాంట్ల గాలించిన బియ్యం ఎయ్యాల...'

కొద్దిసేపు తాను చెబుతున్న విషయం ఆపి, మరలా కొనసాగిస్తూ,

'కొంతసేపటికి ఎసరొస్తది బిడ్డా. గప్పుడు మాలేస్ర బుడ్డి తీసెయ్యాల. అన్నముడికిందా లేదని ఒక్క గింజ సూస్తే సాలు. కొద్దిగా పలుకుందనంగా కుండ మూతికి సిబ్బి పెట్టి గంజొంపాల. తర్వాత సన్నటి సెగ మీద అన్నాన్ని ఉమ్మగియ్యాల. గంతే బిడ్డా' అంటూ పాపని ముద్దాడింది.

పాప ముఖంలో ఏ భావం లేదు.

'నాకేం అర్థం కాలేదు. గ్రాండ్ మా ఏం మాట్లాడింది' తండ్రిని అడిగింది పాప.

'పల్లెటూర్లో అన్నమెలా వండాలో చెప్పింది' క్లుప్తంగా జవాబిచ్చాడు మాధవ్.

'ఇంత ప్రొసీజరా' పాప ఆశ్చర్యం వ్యక్తం చేసింది.

తోట నుంచి తెచ్చిన అరటి ఆకుల్లో అన్నం వడ్డించారు. వేడి వేడి పప్పులో నెయ్యి వేసారు. పాపకి అన్నం రుచిగా అనిపించింది.

'డాడీ! గ్రాండ్ ఫా లీఫ్‌నిండా అన్నం పెట్టుకున్నాడు. డైజెస్టు అవుతుందా' అమాయకంగా ప్రశ్నించింది పాప.

మాధవ్‌కి ఏం జవాబీయాలో అర్థం కాలేదు. తమాయించుకుని,

'పాపా! గ్రాండ్ ఫా ఊర్లోనే ఉంటారు. బాగా హార్డు వర్కు చేస్తారు' అన్నాడు.

'ఏం హార్డు వర్కు' అడిగింది పాప.

'అగ్రికల్చర్' జవాబిచ్చాడు తండ్రి.

'బియ్యం పండిస్తారా' అడిగింది వెంటనే.

'అహఁ. వడ్లు పండిస్తారు' సరిచేశాడు మాధవ్.

'బియ్యానికి, వడ్లకి ఏం తేడా' మరలా ప్రశ్నించింది పాప.

మాధవ్‌కి ఏం చెప్పాలో తెలియక, కొన్ని వడ్లు, బియ్యం తెప్పించి చూపించాడు. వడ్లు, బియ్యమెలా అవుతాయో చెప్పాడు.

'వడ్లు భూమిలో కాస్తాయా డాడీ జింజర్‌లాగా' సైన్సు పాఠాన్ని జ్ఞాపకం చేసుకుని అడిగింది పాప.

'అహఁ లేదమ్మా. మొక్కకే కాస్తాయి. మనం సాయంత్రం పొలం పోదాం' అన్నాడు మాధవ్.

పంట పొలాలు, పూల చెట్లని చూసి,

'ఇవి అచ్చం సినిమాలోగానే ఉన్నాయి కదా డాడీ' ఆశ్చర్యంగా అడిగింది పాప.

'అహఁ. ఇలాంటి వాటినే సినిమా తీస్తారు' సరిదిద్దాడు మాధవ్.

గోచితో- ఒళ్ళంతా బురద నిండుకొని, పొలంలో పనిచేస్తున్న కూలిజనాన్ని చూసి పాప,

'వాళ్ళు అమ్మలాగా, మీలాగా ఆఫీసుకు పోరా డాడీ' పాప ప్రశ్నించింది.

మాధవ్ జవాబీయలేకపోయాడు.

'వాళ్ళని దోమలు కుట్టవా డాడీ?'

'ఎందుకు కుట్టవు? కుడతాయి'

'స్నేక్స్ పొలాల్లో ఉంటాయని టెక్స్ట్ బుక్స్‌లో చదివాను. వారిని కరువవా?'

'అవి లోపల ఎక్కడో ఉంటాయి. పగలు బయటకి రావు'

తండ్రీ కూతుర్ల సంభాషణ అంతటితో ముగిసింది. వాళ్ళు ఇంటికి తిరిగొచ్చేసరికి సాయంత్రం అయింది.

'ఇప్పుడే దోమలు విపరీతంగా కుడుతున్నాయి. నైట్ ఎలాగా' అడిగింది మిసెస్ మాధవ్.

'రిపెల్లెంట్ ఉందిగా' అన్నాడు మాధవ్.

ఆ రాత్రంతా నిద్ర పోలేకపోయింది మిసెస్ మాధవ్. ఎక్కడో కుక్కలు అరవటం, ఎవరో ఏడవటం- దానికితోడు మొండి దోమల దాడి.

'మనం ఇంటికెల్దామండీ' అడిగింది మిసెస్ మాధవ్.

'డాడీ! బోరు కొడుతుంది. కనీసం టి.వి. కూడా లేదు' పాప ఫిర్యాదు చేసింది.

వారం అనుకున్న ప్రయాణం మూడు రోజులకే ముగిసింది. స్కార్పియో పట్నానికి పరుగులు తీసింది.

ఇంటికొస్తూనే ఎ.సి. ఆన్ చేసింది మిసెస్ మాధవ్. మాధవ్ బెడ్‌పై వాలి విశ్రాంతి తీసుకోసాగాడు. పాప అనిమేషన్ ప్రోగ్రాంలో పంట పొలాలు, పూల చెట్లు చూసి కేరింతలు కొట్టసాగింది.

'ఆ డెడ్లీ సైలెన్స్... మై గాడ్! నేను మరలా అనుభవించదలుచుకోలేదు. సాయంత్రం ఏదైనా పార్కుకి పోదామండీ. నైట్ ఏదైనా హోటల్లో బఫే కానిస్తే సరి... ఐ హేట్ విలేజ్ లైఫ్' అంటూ బెడ్‌పై వాలిపోయింది- సెంటర్ ఫర్ రూరల్ స్టడీస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వనజా మాధవ్.

తన ఇరవై అయిదేండ్ల రూరల్ లైఫ్, మరో ఇరవై అయిదేండ్ల అర్బన్ లైఫ్‌ని విశ్లేషించసాగాడు మాధవ్.

అక్కడ ఊర్లో రామలక్ష్మి, రాఘవయ్య దంపతులు ఎడ్ల బండిపై స్కార్పియో చిమ్మిన బురదను కడుగుతూ కళ్ళ నీళ్ళు తీసుకుంటున్నారు. ■